# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 159 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 08 మే 2026 | పేజీలు : 4




ఫిర్యాదులపై తక్షణమే
## స్పందించాలి
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

3

## జనగణన ప్రతి పౌరుడి బాధ్యత

- సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి పునాది
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- జనగణనపై అవగాహన ర్యాలీ

2లో






# చివరి గింజ వరకు కొంటాం..

- గోదావరి జలాలతో నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం, దిగుబడి పెరిగింది
- అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. రఘునాథపల్లి మండలం నిడిగొండలో 15లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కడియం ప్రారంభించారు. అనంతరం రఘునాథపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రఘునాథపల్లి మండలానికి సంబంధించిన 56 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.56 లక్షల 06 వేల 496 విలువగల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తుందని అన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే వారని అన్నారు. ఈ విషయాన్నీ రైతులు అర్థం చేసుకొని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైతులు పండించిన పంటను చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. పేద ప్రజల స్వంత ఇంటి కళను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాకారం చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే 6 గ్యారెంటీల అమలులో భాగంగా అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, సన్నాలకు బోనస్, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, నీడిగొండ సర్పంచ్ వీరస్వామి, పీఏసీఎస్ చైర్మన్ నరసింహ రెడ్డి, తహసీల్దార్ ఎంపీడివో, హౌసింగ్ డీఈ, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## ‘గణన’ లక్ష్యం కోసం.. అధికారుల ‘చెత్త’ పని

జనగణన అవగాహన వాక్‌లో పిల్లల తరలింపుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జనగామలో అధికారికంగా నిర్వహించిన జనగణన అవగాహన మ్యారథాన్ వాక్ కార్యక్రమానికి శుక్రవారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి పిల్లలను తీసుకొచ్చారు. అయితే ర్యాలీ పూర్తి తరువాత వచ్చిన పిల్లలను పంపిచేందుకు అధికారులు ఇలా చెత్తను తరలించే వాహనంలో పంపడం విమర్శలకు దారిసింది. జనగణన కోసం చేపట్టిన ఓ మంచి పనిలో కొందరు అధికారులు చేసిన ఈ ‘చెత్త’కి అంతా అబాసుపాలైనట్లైంది. - *మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి*






# జనగణన ప్రతి పౌరుడి బాధ్యత

- సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి పునాది
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ
- జనగణనపై అవగాహన ర్యాలీ

**జనగామ, మన చౌరాస్తా :** జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి పునాది అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పేర్కొన్నారు. జనగణనపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను శుక్రవారం ఉదయం ఐడిఓసీ కార్యాలయం నుంచి నెహ్రూ పార్క్ వరకు "జనగణన అవగాహన వాక్" ను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, జనగామ మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ హాజరై జనగణన అవగాహన వాక్ ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన విధానం మే 10 వరకు జరుగుతుందని, ఈ స్వీయ గణనలో ఇప్పటివరకు ఐదు వేల మంది నమోదు చేసుకున్నారని, ఈ స్వీయ నమోదు శాతాన్ని మరింతగా పెంచాలని, అందరూ ఈ స్వీయ గణనలో నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే మే 11వ తేదీ నుంచి ఇళ్ల గణన ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఇందులో మొత్తం 34 ప్రశ్నలు ఉంటాయని, ఈ వివరాలు అంతా కూడా గోప్యంగా ఉంటుందని, అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని, ప్రజలు ఎటువంటి భయం పడాల్సిన అవసరం లేదని, దీనికి సంబంధించిన సహాయ కేంద్రం కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా జనగణనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన అవగాహన వాక్‌లో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ బాలమణి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి కుటుంబం సరైన వివరాలు అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని కోరారు. తదనంతరం డీసీపీ మాట్లాడుతూ జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. దేశ అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని, "మన సమాచారం - మన భవిష్యత్తు" అనే భావనతో ప్రతి ఒక్కరూ జనగణన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవోలు గోపీరాం, వెంకన్న, డీఏఓ అంబికా సోనీ, ఉద్యానవన శాఖ అధికారి రవికాంత్, వైద్య శాఖ అధికారి మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పనులపై ప్రత్యేక పర్యవేక్షణ

**నర్మెట, మన చౌరాస్తా :** నర్మెట మండల పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, గ్రామ నర్సరీ అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీడీవో కావ్య శ్రీనివాస్ పరిశీలించారు. పనుల పురోగతి, కార్మికులకు కల్పిస్తున్న సదుపాయాలు, మొక్కల సంరక్షణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ఎంపీఓ ఆకుల వెంకట మల్లికార్జున్, గ్రామ సర్పంచ్ గోపగోని శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ఉపాధి హామీ పనులు నాణ్యతతో కొనసాగించాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఉపాధి హామీ కార్మికులతో అధికారులు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# సౌర విద్యుత్‌పై రైతులకు అవగాహన

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** జనగామ మండలం చీటకోడూర్ రైతు వేదిక లో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "రైతు వారం" కార్యక్రమం నిర్వహించారు. ఏఈ రామగిరి మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో "వ్యవసాయ క్షేత్రాలు సౌర విద్యుత్ కేంద్రాలు" అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ పంపు సెట్లు, పీఎం కుసుం పథకం ద్వారా సోలార్ ప్లాంట్లతో విద్యుత్ ఉత్పత్తి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, సర్పంచులు, సుమారు 30 మంది రైతులు పాల్గొన్నారు.

# మత్స్య సహకార సంఘం మహిళా సొసైటీ ఎన్నికలు

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** మండలంలోని షామీర్‌పేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మహిళా సొసైటీ ఎన్నికలు ఎన్నికల అధికారి ఉమా శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా నిమ్మల రేణుక, ఉపాధ్యక్షురాలిగా కాటబోయిన మహాలక్ష్మి, కార్యదర్శిగా పిట్టల మమత ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా గువ్వల విజయ, కొలిపాక సుజాత, ఏది శిరీష, గుర్రాల లత, ఏదు విజయ, సోనబోయిన రాధిక ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.







# కాంటా, రవాణా ఒకేసారి కావాలి

- సరిపడా సిబ్బందిని పెట్టుకోండి
- ప్రతీ కేంద్రానికి ట్రక్ కేటాయింపు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**జనగామ, మన చౌరాస్తా :** అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు, రవాణా వేగంగా జరగాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. లింగాలఘణపురం, నెల్లుట్ల, వనపర్తి, దేవరుప్పుల మండలం దరావత తండా, సీతారామ్ పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చింది. ఎంత మందికి టోకెన్ ఇచ్చారు. ఎంత కొనుగోలు చేశారు. లారీలు ఏ టైం కి వస్తున్నాయి. లోడింగ్, ఆన్ లోడింగ్‌కు ఎంత టైమ్ పడుతుంది.. అని తదితర వివరాలను కలెక్టర్ కేంద్ర నిర్వాహకులని అడిగి తెలుసుకున్నారు. లారీతో పాటు కేంద్ర నిర్వాహకులకి సంబంధించిన వారు ఎవరైన ఒక్కరు తప్పకుండా ట్రక్ తో పాటు వెళ్లి మిల్లు లలో తొందరగా ఆన్ లోడ్ అయ్యేలా చూడాలన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా రవాణా ఇంకా త్వరగా అయ్యేందుకు... కొనుగోలు అయిన ధాన్యాన్ని రైతులు తమ సొంత వాహనాలలో మిల్లు లకు తరలించుకునే అవకాశాన్ని కల్పించినట్లు కేంద్ర నిర్వాహకులకు కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కేంద్రాల్లో గాని మిల్లుల వద్ద గాని ఏమైనా సమస్య లు తలెత్తితే వెంటనే రాత పూర్వకంగా తమ దృష్టి కి తీసుకరావాలని, వెంటనే తగు చర్యలు తీసుకుంటామని రైతులకు కలెక్టర్ సూచించారు. సీతరాంపూర్ లోని మైనర్ ఇరిగేషన్ ట్యాంక్ వద్ద జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కలెక్టర్ పరిశీలించారు. పెండింగ్ వర్క్స్ ఎం ఉన్నాయి అని అడిగి తెలుసుకుని కమ్యూనిటీ వర్క్స్ కి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పూడిక తీసిన మట్టి ని ఎక్కడికి తీసుకెళ్తున్నారు అని కలెక్టర్ అడగగా అక్కడ ఉన్న రైతులు తమ పొలంలోకి వేసుకునేందుకు తీసుకెళ్తున్నట్టు తెలిపారు.





# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

## వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ సీపీ గురువారం వెస్ట్ జోన్ పరిధిలోని చిల్పూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ ఉదయం చిల్పూర్ పోలీస్ స్టేషన్ కు పోలీస్ అధికారులు పోలీస్ కమిషనర్ కు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్, ఐటీ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును సీపీ సిబ్బందిని పని తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులతో పాటు, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులు, ప్రస్తుతం పెండింగ్ కేసుల రికార్డ్ లకు సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చివరగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రతి గ్రామస్తుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పై అవగహనా కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకై ముందస్తు చర్యలు తీసుకోవాలని,అక్రమ ఇసుక రవాణా, పాఠశాలల పరిసరాల్లో పోగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందికి తెలిపారు. ఈ తనిఖీల్లో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్,ఏసీపీ భీం శర్మ,సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఐ నవీన్ కుమార్ ఉన్నారు.

### వెంకన్నకు పూజలు

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం చిల్పూర్ లోని బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి పోలీస్ కమిషనర్ కు తీర్థ ప్రసాదాలు స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టతను, ప్రాముఖ్యత, ఆలయంలో జరిగే కార్యక్రమాల వివరాలను ఆలయ పూజారి పోలీస్ కమిషనర్ కు వివరించారు.

## మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** మండలంలోని గాంధీనగర్ గ్రామంలో నవక్రాంతి పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని గురువారం గ్రామ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి మాణిక్యాపూర్ గ్రామ పరిధిలో రైతులు ఈ ఏడాది మొక్కజొన్న పంటను అధికంగా సాగు చేశారు. అయితే పంటను విక్రయించేందుకు ఎల్కతుర్తి సహకార సంఘంలోని మార్క్ ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లడంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి ప్రస్తుత బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి పొన్నం రైతుల సౌకర్యార్థం ఉమ్మడి మాణిక్యాపూర్ గ్రామంలోనే మక్కల కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రం మంజూరు కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## బీజేపీ కార్యకర్తల దాడి అమానుషం : వొడితల

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** -కరీంనగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై అక్కడి బిజెపి కార్యకర్తలు దాడికి పాల్పడడం అమానుషమైన చర్య అని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై డ్రగ్స్ అంటూ అనేక ఆరోపణలు చేస్తున్న బిజెపి, కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను ఖండిస్తూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అపార్థం చేసుకొని దాడికి పాల్పడ్డారని అన్నారు. క్యాంపు కార్యాలయంపై దాడి చేయడంతో పాటు ఎమ్మెల్యే వాహనాన్ని ధ్వంసం చేసిన దుండగులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు బిజెపి పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# సభ్యురాలికి రూ.2 లక్షల భీమా చెక్కు అందజేత

హనుమకొండ, మన చౌరాస్తా : హనుమకొండ జిల్లా ములకనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు భద్రతా పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా సంఘ సభ్యులందరికీ ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ ద్వారా “జనతా పర్సనల్ యాక్సిడెంటల్ పాలసీ” అమలు చేస్తున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఇటీవల కొత్తపల్లి గ్రామానికి చెందిన సంఘ సభ్యుడు అప్పని నాగేంద్రం గత ఏడాది అక్టోబర్ 30న వాగులో ఆకస్మిక వరదలో కొట్టుకుపోయి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సంఘం అమలు చేస్తున్న ప్రమాద భీమా పాలసీ కింద రూ.2 లక్షల భీమా క్లెయిమ్‌ను ఆయన నామినీ అప్పని అనితకు సంఘ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, సంఘ జనరల్ మేనేజర్ మారుపాటి రాం రెడ్డి, ఉపాధ్యక్షులు గజ్జి వీరయ్య, డైరెక్టర్లు గనబోయిన శ్రీనివాస్, కాసిరెడ్డి వసంత, బొల్లంపెల్లి కుమారస్వామి, అంబాల రాములు, బేల కనుకమ్మ, కర్రె మహేందర్, కంది రవీందర్ రెడ్డి, మండ శ్రీనివాస్, చెవ్వల్ల బుచ్చయ్య, ఈర్ల మూగయ్య, గుగులోతు బాషు, గుర్రాల భాస్కర్ రెడ్డి, బొల్లపెల్లి వీరారెడ్డి పాల్గొన్నారు.



# కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలి : బీజేపీ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఎంపీ బండి సంజయ్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ పేర్కొన్నారు. బండి సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో బండి సంజయ్‌కు ప్రజల్లో విశేష ఆదరణ ఉందని, ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. అలాంటి నాయకుడిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు, సంస్కారం లేని వ్యాఖ్యలు చేయకుండా నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కౌశిక్ రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని ప్రజలకు, బండి సంజయ్ అభిమానులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై చర్య



బచ్చన్నపేట, మన చౌరాస్తా : మండలంలోని పోచన్నపేట శివారు సదాశివపేట వాగు వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు విషయాన్ని బచ్చన్నపేట ఎస్సై ఏ.శ్రీకాంత్ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ కమ్‌యజమాని గజ్జెల్లి శేఖర్‌పై కేసు నమోదు చేసి, తదుపరి చర్యల కోసం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి, మొరం, ఇసుక తవ్వకాలు లేదా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.



## తెలంగాణ కాంగ్రెస్ అభివృద్ధి ఫలాలపై వర్క్‌షాప్

**హనుమకొండ, మన చౌరాస్తా :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలపై రచయితలు, కళాకారుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించనున్న రచయితల వర్క్‌షాప్‌కు సంబంధించిన కరపత్రాన్ని గురువారం హనుమకొండ జిల్లా కుడా చైర్మన్ ఏనుగాల వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ నెల 29, 30, 31 తేదీలలో జరగనున్న “తెలంగాణ కాంగ్రెస్ అభివృద్ధి ఫలాలు” అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు కళాకారులు, రచయితలు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. రచయితలు, కళాకారులు సామాజిక చైతన్యానికి వారధులుగా నిలవాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో హన్మకొండ జిల్లా అధ్యక్షులు వెన్నమల్ల వెంకటేష్, వరంగల్ జిల్లా అధ్యక్షులు గద్దం సుధాకర్, పాలెపాక రమేష్, నాగుల సుధాకర్, పాలేటి రాజు, శివకృష్ణ, సమ్మయ్య, పిట్ట భవాని, వైద్యుల రజిత, రెడ్డి లత కళాకారులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం పరిశీలించిన కలెక్టర్



**జనగామ, మన చౌరాస్తా :** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, నెల వారీగా తనిఖీలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని ఈవీఎం గోదాంను గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా నమోదు పుస్తకం, సీసీ కెమెరాల పని తీరు, మంటల నియంత్రణ పద్ధతులను పర్యవేక్షించారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పరిశీలనలో జనగామ ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## అగధ టీజర్

# వచ్చేసింది

కామాక్షి భాస్కర్ల ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అగధ'. ఎమ్మెస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విశ్వంలో ఎన్నో అతీత శక్తులు దాగున్నాయంటూ ప్రారంభమైన ఈ టీజర్ సినిమాపై ఆసక్తి కలిగిస్తోంది. 'అగధ' ముందు ఎవరి ఆటలు సాగవంటూ చెప్పే డైలాగ్ పాత్ర ప్రాధాన్యతను తెలియచేస్తోంది. ప్రతిక్షణం ప్రేక్షకుడికి ఉత్కంఠ కలిగించాలన్నదే తన ప్రయత్నమని డైరెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. విజువల్ ఎఫెక్ట్స్, గెటప్స్, ఆ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, భయం గొలిపే లొకేషన్లు, విచిత్రమైన ఎక్స్‌ప్రెషన్స్, మధ్య మధ్యలో ఆసక్తి రేకెత్తించే డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. 'ఆ వీడియోలో నువ్వు ఏం చూసావమ్మా' అని అడిగితే, ఒక అమ్మాయి భయంతో వణికిపోతూ 'అగ్... అగ్... అగధ' అని చెప్పడంతో 'అగధ' అంటే ఎవరు అనే ఆసక్తి కలుగుతుంది. 'అగధ' వచ్చేసిందమ్మా. 'అగధ' ముందు ఎవ్వరి ఆటలు సాగవు. రా...'అగధా? రా'అంటూ వినిపించే డైలాగ్స్ తో టీజర్ తాలూకు ఉత్కంఠ పీక్ లెవెల్ కి చేరినట్టుగా అనిపిస్తుంది. త్వరలో ట్రైలర్ ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**